సాక్షి పల్నాడు

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి రూ.లక్ష వితరణ

నరసరావుపేటరూరల్: త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానానికి గుంటూరుకు చెందిన చావలమాదుగు కవిత తన భర్త వెంకటరావు పేరుపై లక్ష నగదు అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.5600, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

నాలుగు కరోనా కేసులు



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. లాం, లేమల్లెపాడు, వెంగళాయ పాలెం, గుంటూరు అరండ ల్‌పేటలో ఒక్కొక్కటి చొప్పున కరోనా కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం రామానుజుల వారికి తిరుమంజనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలియజేశారు. భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఉదయం తిరుమంజన సేవ, అలంకరణ, తదుపరి గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, అనంతరం తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామానుజుల వారి అనుగ్రహాన్ని పొందినట్లు తెలిపారు.

ఏడుగురు ఎస్‌ఐలు బదిలీ

బాపట్లటౌన్: జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల డీసీఆర్‌బీలో ఉన్న జీ.వి.చౌదరిని కొరిశపాడుకు, డీసీఆర్‌బీలో ఉన్న పి.నాగశివారెడ్డిని మేదరమెట్లకు, చినగంజాం ఎస్‌ఐగా ఉన్న కె.అనూక్‌ను యద్దనపూడికి, యద్దనపూడి ఎస్‌ఐగా ఉన్న డి.రత్నకుమారిని వీఆర్‌కు, కారంచేడు ఎస్‌ఐగా ఉన్న ఎం.అనితను వీఆర్‌కు, డీఎస్‌బీలో ఉన్న జి.శ్రీనివాస రావును కారంచేడుకు, వీఆర్‌లో ఉన్న కె.సురేష్‌ను చినగంజాంకు బదిలీచేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.50 అడుగుల వద్ద ఉంది. ఇది 155.7360 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 6,888 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,897 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.2203 టీఎంసీలకు సమానం.

ఉత్తమ పంచాయతీగా నడింపాలెం

'హెల్దీ పంచాయతీ' థీమ్ కేటగిరీలో ఎంపిక



నడింపాలెం (ప్రత్తిపాడు): రాష్ట్రస్థాయిలో బెస్ట్ పంచాయతీగా 'నడింపాలెం' గ్రామ పంచాయతీ ఎంపికైంది. పంచాయతీల్లో పోటీతత్వం తీసుకురావడంతో పాటు పంచాయతీలను ప్రమోట్ చేసేందుకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల థీమ్‌లను ప్రవేశపెట్టి ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసింది. పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాన్స్‌డ్ లైవ్‌హుడ్ పంచాయతీ, హెల్దీ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, వాటర్ సఫిషియంట్ పంచాయతీ, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ, సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ.. ఇలా తొమ్మిది థీమ్స్‌లో అన్ని జిల్లాల నుంచి బెస్ట్ పంచాయతీలను (ఒక్కో థీమ్ నుంచి మూడు పంచాయతీలు) ఎంపిక చేసింది. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం 'నడింపాలెం' పంచాయతీని 'హెల్దీ పంచాయతీ థీమ్' నుంచి బెస్ట్‌గా ఎంపిక చేశారు. మొత్తం పదిహేను అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఎంపికచేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు.



మాచర్ల ఈద్గాలో జరిగిన రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్.



సత్తెనపల్లి ఈద్గాలో నమాజ్ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాలలో పెద్ద ఎత్తున ప్రార్థనలు
- నెలరోజుల ఉపవాసాలు ముగించిన ముస్లింలు
- సత్తెనపల్లిలో మంత్రి అంబటి దువా



మాచర్ల ఈద్గాలో రంజాన్ ప్రార్థన నిర్వహిస్తున్న ఖాజీ బాజీ

సత్తెనపల్లి, మాచర్ల, నరసరావుపేట: జిల్లాలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరించి, ఈద్గాల వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. సత్తెనపల్లిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు శనివారం భక్తిశ్రద్ధలతో ఈద్గాలలో సామూహిక నమాజ్‌లు నిర్వహించారు. పట్టణంలోని ముస్లిం సోదరులు మాచర్ల రోడ్‌లో గల ఈద్గా వద్ద వేలాది సంఖ్యలో హాజరై భక్తి ప్రపత్తులతో ప్రత్యేక సామూహిక నమాజ్‌లు నిర్వహించారు. ఈ నమాజ్ కార్యక్రమంలో జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు.

నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. స్థానిక ప్రకాష్ నగర్‌లోని ఈద్గా మైదానంలో నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వక్ఫ్‌బోర్డు, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఖురాన్ మార్గంలో అందరూ నడిచి సోదర భావంతో సుఖ శాంతులతో జీవించాలని పలువురు ఆకాంక్షించారు. పేష్ ఇమాం రజా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మాచర్లలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. 23వ వార్డులోని ఈద్గాలో ఖాజీబాజీ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనలో పాల్గొని రంజాన్ ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డిలు ఈద్గాకు చేరుకొని రంజాన్ ప్రార్థనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాబార్డు ఏజీఎం కార్తీక్ బదిలీ

కొరిటిపాడు(గుంటూరు): జిల్లా నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన కార్తీక్ లక్నోకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రాన్ని కార్తీక్ అందుకున్నారు. భువనేశ్వర్‌లో నాబార్డు ఏజీఎంగా పనిచేస్తున్న జి.శరత్‌బాబు గుంటూరు జిల్లా నాబార్డు ఏజీఎంగా నూతనంగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2017 నుంచి ఇప్పటి వరకు జిల్లా నాబార్డు ఏజీఎంగా ఆరు సంవత్సరాల పాటు పనిచేసిన కార్తీక్ లక్నోకు బదిలీ అయ్యారు. శరత్‌బాబు భువనేశ్వర్ నుంచి బదిలీపై వచ్చారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 50 పైగా రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయడంలో కార్తీక్ కీలక పాత్ర పోషించి 35 వేల కుటుంబాలకు లబ్ధిని చేకూర్చారు. ఉత్తమ జాతి గేదెల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకం అమలు చేయడం జరిగింది. వివిధ బ్యాంకులతో సమన్వయం చేసుకొని వేల కోట్ల రూపాయల రుణ సహాయం లబ్ధిదారులకు అందించడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తూ 'నాడు నేడు' గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రూరల్ డోగౌన్‌ల ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజీల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మల్టీ సర్వీసు సెంటర్లుగా ఏర్పాటు చేయడం కోసం వారికి రైతు భరోసా కేంద్రాల ద్వారా రూరల్ గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు, పెట్రోలు పంపులు నాబార్డు ద్వారా మంజూరు చేయడం జరిగింది. జిల్లా రుణ ప్రణాళిక ఏర్పాటులోనూ తమ సహాయ సహకారాలు జిల్లా ప్రభుత్వ శాఖలకు అందించారు. కార్తీక్ పనిచేసిన కాలంలో ఎన్నో రకాల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను అద్భుతంగా అమలు పరిచారు. వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి వాటిని అమలు పరిచి జిల్లా కలెక్టర్ల అభినందనలు పొందడంతోపాటు ఎనిమిదిసార్లు ఉత్తమ అధికారిగా అవార్డుని స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు శనివారం విరాళాలు సమర్పించారు. రాజమండ్రి కోదండ రామాలయం ప్రాంతానికి చెందిన చలుమూరు వెంకట మహేష్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి నిత్యాన్నదానానికి రూ.1.08 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ ఇస్లాంపేటకు చెందిన ఇట్లా అశోక్‌కుమార్, రమ్యశృతి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

• అక్షయ తృతీయ...



అక్షయ తృతీయ సందడి బంగారు దుకాణాల్లో శనివారం కనిపించింది. ఒక్క గ్రాము బంగారమైనా కొనుగోలు చేసేందుకు షాపులకు కొనుగోలుదారులు రావడం కనిపించింది. గుంటూరులో పలు దుకాణాలు క్రయ-విక్రయాలతో సందడిగా కనిపించాయి. -సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

మట్టి పరీక్ష - శ్రీరామరక్ష

భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయాలి. పంట సాగు చేసే ముందు ప్రతి రైతు దీనిపై అవగాహన పెంచుకోవాలి. ఒక పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. పరీక్ష వల్ల ఏ పంట పండించాలో తెలుస్తోంది. ఏ ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల అటు భూమికి ఇటు పంటకు శ్రీరామరక్షగా నిలుస్తోంది.

- నమూనాల సేకరణలో మారిన విధానం
- భూసార పరీక్ష ఫలితాలతో ఎరువుల ఆదా



పాకాలపాడులో మట్టి సేకరణను పరిశీలిస్తున్న వ్యవసాయధికారులు

సత్తెనపల్లి: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. వాస్తవానికి 90 శాతం మంది రైతులు పంటకు కావలసిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటలు సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు తప్ప దిగుబడులు పెరగడం లేదు. అంతే కాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో అమలు చేస్తూ రైతులకు మెరుగైన దిగుబడులు సాధించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకు పోతోంది. ఇందులో భాగంగానే మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయ అధికారులు అడుగులు వేస్తున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి పంటలు సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందుకోసం గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా జింకు లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ స్థూల పోషకాలతో పాటు పీహెచ్ (నైట్రోజన్) సేంద్రీయ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలాచోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

మూడేళ్లకోసారి తప్పనిసరి

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక రసాయనక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తోంది. దీంతో దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మట్టి సేకరణలో జాగ్రత్తలు....

- పొలంలో ఎరువులు వేసిన తరువాత నెల రోజుల వరకు మట్టి సేకరించకూడదు. అదే విధంగా పంటకు నీరు పెట్టిన తరువాత, నీడపడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలు ఉన్నచోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు.
- పంట కోత తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పార నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలం మొత్తంగా 8–10 చోట్ల సేకరించిన మట్టిని ఒకచోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదుటి భాగములను మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అరకిలో వచ్చేవరకు చేస్తూ ఉండాలి.
- ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డి వేర్లను వేరుచేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్ లో గానీ పాలిథిన్ కవర్‌లో గాని నింపి రైతుల వివరాలు రాసి భూసార పరీక్షా కేంద్రాలకు పంపాలి.
- మట్టి సేకరణకు స్థానిక రైతు భరోసా కేంద్ర సిబ్బంది సాయం తీసుకుంటే వారు రైతు పొలం వద్ద మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతారు.

పరీక్షల ఆధారంగా ఎరువులు

భూసార పరీక్ష ఫలితాలతో నేల స్వభావం తెలుస్తుంది. ఉదజని సూచిక మేరకు క్షార స్థితిని తెలుసుకోవచ్చు. లవణ సూచిక మేరకు పంటల స్థితిగతులను అర్థం చేసుకోవచ్చు. ఆ మేరకు భూమికి ప్రధాన పోషకాలను ఎంత మోతాదులో అందించాలో తెలుస్తుంది. పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. రసాయన ఎరువులతో చాలా నష్టాలు ఉన్నాయి. భూమి సారం కోల్పోయి మళ్లీ పంటలు పండని విధంగా తయారవుతాయి. సేంద్రియ ఎరువులైన దిబ్బ పేడ, ఎండిన ఆకులు, అలములను ఎరువుగా వాడుకుంటే చాలా మంచిది. భూమి సారవంతంగా మారి అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేయిస్తున్న భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి.

-ఐ.మురళి,
జిల్లా వ్యవసాయ అధికారి, పల్నాడు.

రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కు రూ.లక్ష విరాళం

నరసరావుపేట: రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌సెంటర్ అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించేందుకు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా బ్లడ్ సెంటర్ నిర్మాణం కోసం అమర కృష్ణమూర్తి అండ్ సన్స్ సంస్థ అధిపతి అమర రాంబాబు రెడ్‌క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ అయిన కలెక్టర్‌కు కలెక్టరేట్‌లో రూ.లక్ష చెక్కు విరాళంగా అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్ నిర్మాణం కోసం విరాళమిచ్చిన అమర రాంబాబును అభినందించారు. సొసైటీ జిల్లాలో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా నరసరావుపేటలో కాంపోనెంట్స్‌తో కూడిన బ్లడ్‌సెంటర్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీనిద్వారా జిల్లాలో రక్తం కొరత లేకుండా ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన రక్తం అందజేసేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు కేఎంఎస్‌వీ శ్రీనివాస గుప్తా, అమర వెంకటేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న రాంబాబు, పక్కన రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

వైఎస్సార్ సీపీలో 30 కుటుంబాలు చేరిక

విజయపురిసౌత్: టీడీపీకి చెందిన 30 మత్స్యకార కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై విజయపురిసౌత్ గ్రామానికి చెందిన ఉమ్మడి కృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గతంలో ఉమ్మడి కృష్ణ, తండ్రి ఉమ్మడి అప్పారావు మత్స్యకారులకు క్రియాశీలక నాయకులుగా పనిచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు నచ్చి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వారు వెల్లడించారు. దీనికి ముందు పీఆర్కే టీడీపీ నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు పీఆర్కే, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనుకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీలో చేరిన వారిలో కొల్లి దుర్గారావు, కాటన్ శ్రీను, మేకల మహేష్, దొడ్డా అప్పలరాజు, చెరుపల్లి రాజేష్, మైలపల్లి గోవింద్, మైలపల్లి మహేష్, సొరాడ శ్రీను, అజ్జిల హరీష్, ఉమ్మడి భాను, ఉమ్మడి మహేష్, అప్పారావు, ఎరిపల్లి మహేష్, అయ్యప్ప, ప్రదీప్, సొరాడ దేవుడు, చెల్లూరి జోగులు, తోటపల్లి రామస్వామి, కారే రవి, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాచర్ల వైస్ ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, బూడిద సైదులు, పెరుమాళ్ళ వెంకట్రామయ్య, మత్స్యకారుల అధ్యక్షుడు కారే ముసలయ్య, మైలపల్లి పూరి, మైలపల్లి ఆనంద్, భూలోక పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

- నిరసనగా బంధువుల రాస్తారోకో
- పోలీసుల జోక్యంతో విరమణ



స్వాతి (ఫైల్)

దుర్గి: వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందినట్లు ఆరోపిస్తూ బంధువులు శనివారం నిరసనకు దిగారు. వివరాలు.. మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన గర్భిణి కుక్కమూడి అశోక్ స్వాతి(22)కి నెలలు నిండి నొప్పులు రావటంతో మాచర్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ నెల 18వ తేదీ మంగళవారం వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చింది. మూడు రోజులుగా చికిత్సను ఆస్పత్రిలో వైద్యులు కొనసాగించారు. బాలింతకు కాళ్లు, ముఖము, చేతులు వాపులు రావటంతో మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహా మేరకు గుంటూరు జనరల్ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన ముటుకూరుకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యులు నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిందని ఆరోపిస్తూ దుర్గి మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ, మాచర్ల, కారంపూడి సీఐలు, ఎస్‌ఐలు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీనిచ్చారు. దీంతో వారు రాస్తారోకో విరమించారు.

26 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ద్వితీయ నాటికల పోటీలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో నాటికల పోటీల బ్రోచర్‌ను నిర్వాహకులు ఎం.సత్యనారాయణశెట్టి, గరికపాటి సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు. తొలిరోజు సభకు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి రోజా పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు. సమావేశానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. అతిథులుగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ హాజరవుతారు. చివరిరోజున ముగింపు సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొంటారని వివరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్వాహక సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, ఆరాధ్యుల కన్నా, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, లక్కరాజు లక్ష్మణరావు, పిట్టు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చైతన్య ప్రబోధాలు... పరిషత్ నాటికలు

- రెండోరోజు కొనసాగిన కొండవీటి కళాపరిషత్ నాటిక పోటీలు
- అతిథుల ప్రసంగాలు.. ఆకట్టుకున్న నాటికలు

యడ్లపాడు: సమాజమనే దేహానికి చైతన్యం చేసే ఊపిరి వంటివి నాటికలు అని శ్రీఅనంత లక్ష్మీ నూలుమిల్లు ఈడీ సామినేని ఫణికుమార్, విరించి రిసార్ట్స్ అధినేత వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని లింగారావుపాలెంలో కొండవీటి కళా పరిషత్ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శనివారానికి రెండో రోజుకు చేరాయి. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూలుమిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేయగా, ఎంపీటీసీ తోకల రాఘవయ్య నటరాజ పూజ చేశారు. పరిషత్ కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పఠాన్ సుభాని, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మూపర్తి కాళిదాసు, గుంటూరు ఎన్‌టీఆర్ కళాపరిషత్ కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, ఎం రవీంద్రబాబు పరిషత్ నిర్వాహకులు ప్రసంగించిన వారిలో ఉన్నారు.

ఓ ప్రేమగులాబీ 'చీకటి పువ్వు'

క్షమాగుణంతో విరిసిన ఓ ప్రేమగులాబీ 'చీకటి పువ్వు' తెలిసో తెలియకో తప్పు చేయడం మానవ సహజం. వాటిని తెలుసుకుని పశ్చాత్తాపంతో మారిన వ్యక్తిని క్షమించి అక్కున చేర్చుకోవడంలోనే గొప్పప్రేమగుణం దాగుందని తెలిపే సందేశాత్మక కథనమే 'చీకటిపువ్వు' నాటిక. ఒక కుటుంబంలో జరిగిన అంతఃసంఘర్షణకు ప్రతిరూపానికి నాటకీకరణ చేసిన తీరు అందర్నీ ఎంతో ఆకట్టుకుంది. పరమాత్ముని శివరాం రచనకు మంచాల రమేష్ దర్శకత్వం వహించిన చైతన్య కళాభారతి (కరీంనగర్) వారు దీనిని ప్రదర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

భావితరాలకు మనం ఇవ్వాల్సింది 'స్థిరాస్తి' కాదు...

మానవతా విలువలు, సామాజిక స్పృహ లేని కోట్ల కొలది ఆస్తులు మనిషి జన్మకు సార్థకత ఇవ్వవని చాటిచెప్పిన నాటికయే 'స్థిరాస్తి'. భగవంతుడు గుళ్లోనే కాదు మానవత్వం నిండిన మనిషి గుండెల్లో ఉంటాడని అందుకు అబ్దుల్‌కలాం, రతన్‌టాటా, మదర్‌థెరెసా, డొక్కా సీతమ్మ వంటి మహనీయులే నిదర్శనమని ఈ నాటిక తెలియజేసింది. సాయం చేసే గుణం ప్రతి హృదయంలో ఉన్నప్పుడే దేశంలో పేదరికాన్ని సమాధి చేయడం సులభతరమవుతుందని సందేశాన్ని అందించింది. సూదనగుంట వెంకటేశ్వర్లు రచనకు వై బుచ్చయ్య చౌదరి దర్శకత్వం వహించిన కళానికేతన్ (వీరన్నపాలెం) వారి ''స్థిరాస్తి'' నాటిక.

రైతన్న జీవనచిత్రాన్ని ఆవిష్కరించిన 'రైతేరాజు'...

భూమినే తల్లిగా భావించి వ్యవసాయమే జీవనాధారం చేసుకుని ఆరుగాలం శ్రమించి పండించిన పంటలతో అందరి కడుపులను నింపుతున్న రైతన్నలు ఎదుర్కొంటున్న సమకాలిన పరిస్థితులను ఆవిష్కరించి ఆలోచింపజేసిన నాటిక 'రైతేరాజు'. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అంతా కల్తీ..వీటికి తోడు ప్రకృతి వైపరిత్యాలు వచ్చిన అరకొర దిగుబడులకు కనీస గిట్టుబాటు ధర లేక అన్నదాత అనాథలా రోడ్డున పడుతున్న రైతన్న జీవన చిత్రాన్ని అద్భుత సంఘటనలతో ప్రదర్శించిన ఈ నాటిక ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. కంచర్ల సూర్యప్రకాష్ రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి (హైదరాబాద్) వారి ''రైతేరాజు'' నాటిక.

నేడు 'థింక్' నాటిక ప్రదర్శన

23వ తేదీ మురుకుట్ల రమేష్‌కుమార్(రాము) కళా ప్రాంగణంలో రాత్రి 8.30 గంటలకు పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాల కమిటీ కన్వీనర్ ముత్తవరపు సురేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన, నంబూరి వెంకయ్యచౌదరి నటరాజ పూజ చేసి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మంజునాథ రచన, దర్శకత్వం వహించిన సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్(హైదరాబాద్) వారి 'థింక్' నాటిక ప్రదర్శించనున్నారు. రాత్రి 10.30గంటలకు పి.సత్యవతి మూలకథకు వల్లూరి శివప్రసాద్ నాటకీకరణ చేసి గంగోత్రి సాయి దర్శకత్వం వహించిన అరవింద ఆర్ట్స్(తాడేపల్లి)వారి 'వెండిఅంచులు' నాటిక, రాత్రి 11.30 గంటలకు విజయార్కే మూలకథకు రావి నాగేశ్వరరావు నాటకీకరణ చేసి గోపరాజు విజయ్ దర్శకత్వం వహించిన సాయి ఆర్ట్స్(కొలకలూరు) వారి 'ప్రేమతో నాన్న' నాటికలు ప్రదర్శించడంతో పాటు బహు మతి ప్రదానోత్సవం సభ నిర్వహించనున్నారు.